# స్మృతి వెలుగులు

కారు నడుస్తోంది.

ఆమె డ్రైవ్ చేస్తుంటే, ఏమిటో తన జీవిత చక్రాన్నే ఆమె త్రిప్పుతున్నట్లు అనిపించింది.

వీధిలైట్లు కారు అద్దాల్లోంచి తొంగి చూస్తున్నాయి యిద్దరిని. అక్కడక్కడ టపాకాయల చప్పుళ్లు; తారాజువ్వల ఎగురుళ్లు; చిచ్చుబుడ్డీల నృత్యాలు.

"పండుగ చూద్దామా" అంది ఆమె.

శేఖరం ఒప్పుకున్నాడు.

ఆమె కారు బయటికితీసి అతన్ని కూర్చోమంది. వీధిలో మరు క్షణం కారు దూసుకుపోయింది.

ఆమె పెట్టుకున్న మల్లెపూలు ఘుమఘుమ వాసనలు విరజిమ్ముతున్నాయి.

ఆమె కట్టుకున్న తెల్లచీర వీధిలోని చిచ్చుబుడ్డి కాంతులతో పోటీ చేస్తున్నది.

"ఆ యిల్లు ఎవరిదో తెలుసా?... మనతో చిన్నప్పుడు ఆడుకున్న రామకృష్ణది. ఇప్పుడు లాయరు_"

"అవును- తెలుసు"

కారు నడిచింది.

"ఇక్కడ మా స్నేహితురాలు డాక్టర్ సరోజిని ఉంటుంది. ఎరుగుదురా?"

"తెలియదు"

కారు మళ్ళింది మరో మలుపు. "ఈ మేడ మా స్నేహితురాలు గాయని కాపురముంటుంది". "అవును ... ఒంటరిగా, మీకూ స్నేహమా". "ఒకటి రెండుసార్లు కలిసాను...భోజనంకూడా చేశా వాళ్ళింట్లో."

కోపంగా ఒక ఓర చూపు చూసింది ఆమె శేఖరం వైపు. ఇంటికి రాగానే ఆమె స్నానంచేసి ఎఱ్ఱచీర కట్టుకుని కుంకం తిలకం దిద్దుకుని అందంగా, మందారంలా వికసిస్తో ఆహ్వానించింది.

"ఇప్పుడే రోగుల నందరినీ వెళ్ళకొట్టాను" నవ్వింది, "ప్రజాసేవ అన్నమాట!" నవ్వాడు శేఖరం. "మీకొక

ఇంజెక్షను యివ్వనా?" "దేనికి?" "తిన్నగా, బుద్ధిగా వుండ డానికి" నవ్వింది ఆమె. శేఖరానికి అర్థమయింది.

క్రిందటిసారి కలుసుకున్నప్పుడు కోపంగా రుసరుస లాడుతూ నిష్క్రమించాడు, ఆమె ఏదో మాట అన్నదని.

కోపంరాకుండా, ఎప్పుడు ఆమెదగ్గరే వుండే ఇంజెక్షన్ ఏదైనా యిస్తే ఎందుకు కాదంటాడు? శేఖరం లోలోపల అనుకున్నాడు.

"మీరలా క్రిందటిసారి వెళ్ళిపోవడం నాకు ఎంతో బాధ కలిగించింది. రోగులకు మందులిస్తున్నానన్న మాటే కాని, మనస్సంతా మీ మీదే, ఒకరి మనస్సు కష్టపెట్టి నట్లు నేననుకుంటే యేమిటో మనస్సు నిలకడగా వుండదు... నేనొక కోరిక కోరనా?" నవ్వింది ఆమె.

"చెప్పండి"

"నేను ఏమన్నా, మీరు కోపం తెచ్చుకోకూడదు. ఎప్పుడూ ఆనందంగా కనిపించాలి"

"తప్పకుండా... మరి నాకోరిక?"

"ఏమిటి ?"

"నిత్యం నిన్ను చూసే వరకు నవ్వాలి"

"బుద్ధిగా వుంటే రోజూ చూస్తూండవచ్చు."

"బుద్ధిగా వుంటా నీదగ్గర కాంపౌండర్ ఉద్యోగం ఇవ్వరాదూ!"

ఆమె ఫక్కున నవ్వింది, ఆనందం పట్టలేక.

వీధిలో ఔట్ ధన్ మని పేలింది-

ఆమె నవ్వు ఆపుకోలేక మంచంమీద ఒరిగి, వాలి, ఓరగాచూసింది. శేఖరం మత్తులో మైమరచి ఒక్క-క్షణం కళ్ళుమూసుకున్నాడు.

"బుద్ధిగా వుండాలి" ఆమె మాట అతని హృదయములో ప్రతిధ్వనించింది.

ఒక తాటాకు టపాకాయ గదిలో పేలింది.

పెద్ద ధ్వని, పొగ.

ఆమె కంగారు పడింది.

గది గుమ్మందగ్గర బేబీ పకపకనవ్వింది. "ఓసి-నీ అల్లరా." "టపాకాయ పేలిందా" నంగనాచిలా అడిగింది బేబీ. టపాకాయ పొగ" శేఖరం ముక్కు-లో దూరింది. దగ్గు పొరలుగా వచ్చేంది. శీతలంతో బాధ పడుతున్న శేఖరానికి.

"ఏం దగ్గుతున్నారు ?"

"ఒంట్లో బాగులేదు."

"మందివ్వనా?" ఆమె అలమారు తెరచింది. మందుల సీసా ఒకటితీసి రెండు మాత్రలు, గ్లాసునీళ్ళు అందించింది. శేఖరం త్రాగాడు అందుకుని. దగ్గు సర్దుకుంది,

ప్లేటులో బిర్యానీ పనిమనిషి లోనికి తెచ్చింది.

"ఇదేమిటి. నేను వేళాకోళంగా అడిగా,"

అలాగా నేను శ్రీకాకోళంగా తెప్పించా తినండి. ఈ వేళ పండుగ మా యింట్లో విందు...

మరో ప్లేటులో పళ్ళు-స్వీట్లు.

అభిమానమంతా ఒంచి అందించి నట్లయింది శేఖ రానికి. అంత చక్కని నవ్వు- తేలిపోతున్న ఆనంద తరం గాలు ఆమె ప్రదర్శించడం శేఖరం ఎప్పుడూ చూడలేదు.

శేఖరం తింటున్నాడు.

ఆమె తాళపుచెవుల గుత్తులు తిప్పుతూ కూర్చుంది. "ఇంచుమించుగా ఏడేళ్ళనుంచి మన పరిచయం, స్నేహం కదూ" ఆమె నవ్వింది.

"అవును. మరొక ఏడుకూడా జతచేర్చు" అన్నాడు శేఖరం. "మనం కలుసుకుంటున్నాం. కాని జీవితంలో కలుసుకో లేకపోయాం."

"అది నా తప్పుకాదు"

"కాకపోవచ్చు. నా తప్పుకావచ్చు. స్త్రీని అర్థం చేసుకోలేని అహంభావం నాలో ఎక్కువ వుంది. ఏవో కలల్లో గంతులేస్తూ వాస్తవిక జీవితంలో ఏంచేయాలో తెలి యని తత్వం నాది. నీకోసం, నిన్ను చూడాలని, కలుసు కోవాలని, ఎన్నిసార్లు, ఎక్కడెక్కడో తిరిగి తిరిగి, వేసారి అనుభూతులు, ఆలోచనల్లో మథించి, ఏవో కళాఖండాలు

వెల్లివిరిసాయి. అవి నాకు మిగిలాయి. కాని నాకు జీవితంలో కావలసింది దక్కలేదు...” నిట్టూర్చాడు శేఖరం.

“ఆనాడు మీ కోసం గంటసేపు నిలిచి చూడాలనుకున్నా, మాట్లాడాలనుకున్నా. కాని గర్వంగా సిగరెట్టు తాగుతూ దూరంగా చూసి చూడనట్లు, అలాపోతే ఏ ఆడది దగ్గరకు పిలవగలదు.”

జీవితంలో ఆమెను పోగొట్టుకున్న మధన శేఖరంలో తగ్గింది. ఆమె మనస్సు అర్థం చేసుకోలేక, తన తప్పువల్లనే ఆమె దూరమైపోయింది. శేఖరానికి తనమీద తనకే కోపం వచ్చింది. తన్ను తానే అసహ్యించుకున్నాడు. ఆత్మహత్య చేసుకోవాలన్నంత మధన పడ్డాడు.

“నన్ను క్షమించు డాక్టర్? ఇంతకు ముందు నిన్ను అపార్థం చేసుకున్నా. నిన్ను గురించి ఏవో క్రూరమైన ఆలోచనలతో బాధపడ్డాను. అపార్థాలులేని దూరమైన జీవితాల్లో కూడా కొంత సంతృప్తి అనందం ఉంటాయి... ఇక ముందు నీగురించి నేను మరోకలా భావించను డాక్టర్.!”

శేఖరం ఆర్ద్రి నయనాలవైపు ఆమె సూటిగా చూసింది. సంభాషణలు కదిలాయి.

జీవితంలో మార్పులు, బంధువులు, స్నేహితులు, దారిలో మార్పులు, గడిపిన పూర్వం, ప్రస్తుతం, తిరిగిన ప్రాంతాలు, చూసిన సినిమాలు, కథలుగా కదిలాయి.

“నేనీమధ్య ఒక యిల్లుకొన్నాను.”

"ఎక్కడ ?"

"కోనేటి కవతల"

"ఎంత ?"

"పదివేలు"

"నాకు ఒక యిల్లు కావాలనుకుంటున్నా ... మీ ఒక్కరికి ఆయిల్లు ఎందుకూ? అమ్మేయకూడదూ!"

"నీకు కావాలంటే అమ్మతా"

"నిజంగా"

"ఊఁ"

"ఎంత కావాలి"

"ఎంత యిస్తే అంత"

"నేనొక రూపాయి యివ్వగలను"

"రూపాయికే తీసుకో"

ఆమె కలకల నవ్వింది.

"నాకొక సారి మీ యిల్లు చూపించరూ ?"

"తప్పకుండా"

"ఎప్పుడు ?"

"మీ యిష్టం"

"ఇప్పుడే"

"ఊఁ కానీ"

"అయితే లేవండి"

ఆమె ప్రక్క గదిలోకివెళ్ళి ముస్తాబయింది. "మీరు సిగరెట్టు కాలుస్తారా?"

"ఆ". "ఇది మీకు బహుమతి"

అందమైన వెండి సిగరెట్టు కేసు ఒకటి అందించింది ఆమె...కారు హారను మ్రోగించి రోడ్డుమీద జనాన్ని తప్పించుకుంటూ.

చుక్కలు కాకర పువ్వొత్తుల కాంతుల్లా మెరుస్తు న్నాయి

కోనేరు దాటింది కారు.

ఆ పేటలో ఒక మేడ.

లోపలంతా చీకటి.

"ఇదా మీయిల్లు. బాగుంది. ఎన్నాళ్ళయింది కొని? ఎవరూ యిందులోలేరా నేను కొన్నా, ఒకవాటా మీకు అద్దెకు యిస్తా."

"భోజనం కూడ అద్దెకు మీరే పెట్టాలి!"

ఆమె కిలకిల నవ్వింది. తలుపు తీశాడు శేఖరం.

క్రిందివరండా కొద్దిగా బూజులు గోడలకు వ్రేలాడు తున్నాయి.

"కొంచెం మరామ్మత్తు చేయించాలనుకుంటున్నా. తర్వాత అద్దెకిస్తా. నువ్వు కొనుక్కుంటే నీకేయిస్తా."

వరండా వెనుక నాలుగు గదులు, పెద్ద కాంపౌండు. చీకటిలో ఏపుగా మొలిచిన తుప్పలు చెట్లు, కాంపౌండులో భయంకరంగా కనిపించాయి. మేడ ఎక్కారు. మధ్య హాలులో ఒక పెద్ద ఫొటో.

"ఎవరిదా ఫొటో...?" ఆమె ఆశ్చర్యంగా అడిగింది. "మునుపటి యజమాని తాలూకు వారు ఫొటోలు తీసుకు పోలేదు ఇంకా, కట్టకట్టించి జాగ్రత్త పెట్టించమన్నారు."

"ఆ తలపాగా మనిషి...". "నువ్వు ఎరుగుదువా?"

"ప్రక్కనున్నాయన..."

"తెలుసా నీకు?..."

"కాదు ..ప్రక్కనున్నాయన...మా నాన్న"

"అలాగా...వీరిద్దరూ స్నేహితులు కాబోలు..."

"వీరయ్య...ఆ తలపాగా మనిషి మానాన్నను హత్య చేశాడు..." "ఏమిటీ?" కంగారు పడ్డాడు శేఖరం.

"నిజంగా ఇదేఫొటో మా యింట్లో చిన్నసైజుది వుంది. మా అమ్మ చెప్పింది నాకు. కేసులేకుండా తప్పించుకొని బ్రతికి బయటపడ్డాడు.

"ఆ తలపాగా ఆయన చనిపోయాడనుకుంటా. ఆయన కొడుకు నుంచి కొన్నా ఈ యిల్లు..." ఫొటోమీంచి ఒక ఎలక ఆమెమీదకు దూకింది.

ఆమె కెవ్వున కేక పెట్టింది...

శేఖరం దిగ్భ్రమ చెందాడు.

దగ్గరకు వెళ్ళి అనునయించాడు.

కర్టెను కదిలింది...

కదిలిన కర్టెనుమీద నీడ ఆడింది.

బయట ఔట్ పేలింది.

ఏదో నీడ భూతంలా... అరిచింది ఆమె.

"ఎందుకంత భయం..."

"ఈ యింట్లోనే విషంపెట్టి నాన్నని చంపారని అమ్మ చెప్పింది. కోనేటి ప్రక్కయింట్లో... ఇదే యిల్లు!"

"పదండి పోదాం! " మానుపిల్లి మ్యేవ్ మంది గోడ మీద. ఆమె తుళ్ళిపడింది.

"ఈ యింట్లో నాన్న-దెయ్యంలా ఇప్పటికి వుంటు న్నారట; అందుకి ఇక్కడ ఎవరూ వుండరట, మీరు కొన్నారు... ఎందుకు కొన్నారు ?" ఆమె గబగబ మెట్లు క్రిందకు నడిచి ఆగిపోయింది "నాకు భయమేస్తోంది ... మీరూ రండి"

శేఖరం లైట్లు ఆర్పి క్రిందకు నడిచాడు. ఆమెతో.

త్వరత్వరగా యిల్లు గదుల తలుపులుమూసి తాళం వేశాడు.

నడివీథిలో జనం కదులుతున్నారు. ఆమె వడివడిగా పోయి కారులో కూర్చుంది.

శేఖరం వెళ్ళి ఆమె ప్రక్క కూర్చున్నాడు. "మిమ్మల్ని ఒక కోరిక కోరనా!" "అడుగు." ఆ యిల్లు అమ్మేయండి ఎవరికైనా—నాకూవద్దు మీకూ వద్దు...". "ఎందుకు?" "నాన్నకు అమ్మంటే పడదు ... చిన్నప్పుడు చావ చితక కొట్టేవాడు, అది భరించలేక అమ్మ నాన్నను వదిలేసింది. 'ఇప్పటికీ చనిపోయిననాన్న దయ్యంలా—మీదవాలి ఆమెను అనేక హింసలు పెడతా'డంటుంది అమ్మ శేఖరం ఆలోచనలో పడ్డాడు. "ఆ యిల్లు అమ్మివేయరాదా" ఆమె బ్రతిమాలింది.

ఆమె యెందుకు యింత ప్రాధేయపడుతోంది?...ఆ యింట్లోచేరి, వాళ్ళనాన్న దెయ్యం చేత తనూ పీడింపబడి చచ్చిపోతే ... ఆమెలేని జీవితం ... ఒక కలలా ... ఎండ మావుల్లా, కదలుతోంది, నడుస్తోంది.

"నా మీద ఒట్టే...ఆ యిల్లు అమ్మకపోతే..."

కారాపేసి ఆమె ఏడ్చింది. రోడ్డుప్రక్క జనం తండోపతండాలుగా నగరములోని దీపావళి వేడుకలు చూడ్డానికి వెడుతున్నారు. ఆమె కన్నీటిలోంచి ఎంతో అభిమానం. ఆమె ఏడుస్తూ తన్ను కౌగలించుకుంది.

"అలాగే అమ్మేస్తాను" వాగ్దానం చేశాడు శేఖరం.

కారు నడిచింది.

తన ఇంటివద్ద ఆమె దింపుతానంది. కాదని శేఖరం ఆమె యింటిదగ్గర దిగి, పదిలంగా ఆమెను యింట్లోచేర్చి వీధిలోకి నడిచాడు.

గుండెలు అదిరేలా బాణాసంచాలు ఠపీలుమని పేలుతున్నాయి. మర్నాడు ఆ యింటి మీాద ఒకబోర్డు. "ఈ యిల్లు తక్షణం అమ్మబడును."

*    *    *    *

శేఖరం ఉలిక్కిపడ్డాడు... వెనకనే పెద్దశబ్దం మోతవిని.

తన ఆలోచనలనుంచి తేరుకున్నాడు శేఖరం. ఎదురుగా స్నేహితుడు సుందరం ఆలోచిస్తున్న శేఖరం కదలకుండా ఉంటే ఒక నేలటపాకాయ పేల్చాడు.

"ఇంకా ఇక్కడే వున్నావేరా. పద ... దీపావళిని వీధుల్లోచూద్దాం" సుందరం లేపాడు శేఖరాన్ని.

నవ్వుతూ లేచాడు శేఖరం. ఎప్పుడో తాను ప్రేమించి, ఇప్పటికీ ప్రేమను మరచిపోలేక ఆలోచిస్తున్నా ఆమె గురించి ఆ పగటి కల...

పొద్దున ఊరిచివర బంగళా ఒకటి పాడుపడింది చూశాడు. కోనేటి ప్రక్కనే ఉంది అది. ఆయింటికీ. ఆమెకీ... ఆకులలో ... ఆదీ సంబంధం...

ఆమె బహుశా ... భర్త ప్రక్క...పిల్లలతో...చిదానందంగా...ఎక్కడో మతాబాలు కాలుస్తూ...పిల్లలచేత కాల్పిస్తూ...భర్తను హేళనచేస్తూ...నవ్వుతూ వుంటుంది. అదే కలకల నవ్వు...ఆ నవ్వు పువ్వులా వికసించింది శేఖరం కళ్ళముందు...

"ఏమిటిరోయి ... యింకా ఆలోచనలే" అన్నాడు సుందరం మరో నేలటపాకాయ కొట్టి, ఆ...ఏమీలేదులే.." నవ్వేశాడు శేఖరం...నడి వీధిలోకి నడిచాడు...

వీధిలోని దీపావళి...తన జీవితంలో లేని దీపావళి... అందరికీ దీపావళి...తనకు నిరాశా రేఖావళి... శేఖరం కన్నీరు బుగ్గలకారి కన్నులు వేలార్చిన వెలుగు చుక్కల్లా రాలాయి-